# అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ.. కోశ విధానం

**ఆర్థిక వ్యవస్థ సుస్థిర వృద్ధి సాధించాలంటే సమగ్రమైన విత్త వ్యవస్థ అవసరం. వ్యాపార చక్రాల కాలంలో ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవానికి కేంద్ర బ్యాంక్ ప్రకటించే ద్రవ్య విధానంతోపాటు ప్రభుత్వ కోశ విధానం కూడా కీలకమే. ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో దేశంలో పలు రంగాల్లో వృద్ధిని అలాగే కొనసాగించే లక్ష్యంతో ప్రభుత్వం దాదాపు రూ.1,86,000 కోట్ల మద్దతును ప్రకటించింది. ప్రభుత్వ వ్యయానికనుగుణంగా ఆర్థిక వనరుల సమీకరణలో ప్రభుత్వ రుణభారం పెరుగుతూ ఉంది. ఈ నేపథ్యంలో భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో కోశవిధానం ఎలా ఉండాలి అనే భావనతో ఈ సిలబస్‌కు రూపకల్పన చేశారు.**

**పేపర్- III**

**విభాగం-I యూనిట్-V సిలబస్**

రెవెన్యూ విధానం, వ్యయం, ప్రభుత్వ రుణం, ఆర్థిక వ్యవస్థ మీద ప్రభావాలు

## ఎక్స్‌పెక్టెడ్ ప్రశ్నలు

**1. భారతదేశంలో పన్నుల వ్యవస్థను విమర్శనాత్మకంగా పరిశీలించండి?**

జ. భారతదేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న పన్నుల వ్యవస్థ సమానత్వం, సమర్థత సాధించడానికి విఘాతం కలిగించే విధంగా ఉంది. స్వాతంత్ర్యానంతరం మొత్తం పన్నుల రాబడిలో పరోక్ష పన్నుల వాటా ఎక్కువ. పురోగామి పన్నుగా భావించే వ్యక్తిగత ఆదాయపు పన్ను వాటా మొత్తం పన్నుల రాబడిలో 15 శాతం మాత్రమే. కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల స్థాయిలో ముడిసరుకులు, ఉత్పత్తి, మూలధన వస్తు ఉత్పత్తిలో బహుళ స్థాయిల్లో విధిస్తున్న పరోక్ష పన్నులు ఉత్పత్తికి అవరోధంగా నిలిచాయి. ఈ సమస్య నివారించడానికి రాష్ట్రాల్లో విలువ ఆధారిత పన్ను (VAT) ప్రవేశపెట్టినప్పటికీ ఇప్పటికీ అమల్లో ఉన్న కేంద్ర అమ్మకం పన్ను (CST).. సమస్య పునరావృతం కావడానికి దోహదం చేసింది. పన్నుల వ్యవస్థ క్లిష్టతరంగా ఉండడం వల్ల పన్ను ఎగవేత, అవినీతి పెరిగాయి. పన్ను ఎగవేత వస్తు సేవలు, పొదుపు, పెట్టుబడులకు సంబంధించి డిమాండ్ సప్లైపై ప్రభావం చూపిస్తుంది. ఇటీవలి



కాలంలో దేశంలో ప్రత్యక్ష పన్నుల రాబడి పెరగడాన్ని గమనించవచ్చు.

☞ ఈ నేపథ్యంలో పెరుగుతున్న ప్రత్యక్ష పన్నులు సాంఘిక న్యాయం, సమానత్వం సాధించడానికి ఎలా దోహదం చేస్తుందో విశ్లేషించాలి. దీంతో పాటు వివిధ వ్యాపార చక్రాల దశల్లో పన్నుల వ్యవస్థను ఎలా రూపొందించుకోవాలి అనే విషయాలను చర్చించడం సముచితంగా ఉంటుంది.

**2. పన్నుల సంస్కరణలు ఆర్థిక వ్యవస్థలో ఏ మార్పులకు దారి తీశాయి?**

జ. పన్నుల వ్యవస్థకు సంబంధించి సంస్కరణలను సూచించడానికి 1991లో రాజా చెల్లయ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ చేసిన సిఫార్సులను దశలవారీగా అమలు చేశారు. ప్రత్యక్ష పన్ను సంస్కరణల్లో భాగంగా వ్యక్తిగత ఆదాయ పన్నును పునర్ వ్యవస్థీకరించారు. మినహాయింపులు, రాయితీలు తగ్గిస్తూ తక్కువ రేటు, స్లాబ్‌లు, అధిక మినహాయింపు పరిమితి నిర్ణయించారు. ధరల పెరుగుదల వల్ల సంభవించే మూలధన రాబడులపై మాత్రమే పన్ను విధిస్తారు. దీర్ఘకాల మూలధన రాబడులపై ఫ్లాట్ రేట్స్‌తో పన్ను విధిస్తారు. సంపద పన్ను సంస్కరణలలో భాగంగా పన్ను బేసిస్‌ను సంపద నుంచి అనుత్పాదక ఆస్తులైన ఆభరణాలు, గెస్ట్‌హౌస్‌పై విధిస్తారు. స్వదేశీ కంపెనీలపై ఉండే కార్పొరేషన్ పన్నును తగ్గించారు. 2002 సెప్టెంబర్‌లో పన్నుల సంస్కరణలకు సంబంధించి విజయ్‌కేల్కర్ కమిటీ ని ఏర్పాటు చేశారు.

☞ ఈ క్రమంలో చెల్లయ్య కమిటీ, కేల్కర్ కమిటీ సిఫార్సులలో వేటిని ప్రభుత్వం అమలు చేసింది. తద్వారా వివిధ పన్నుల రాబడుల్లో వచ్చిన మార్పులను రాయాల్సి ఉంటుంది.

**3. ప్రస్తుత ఆర్థికవృద్ధి మందగించిన నేపథ్యంలో ప్రభుత్వ వ్యయ విధానం ఎలా ఉండాలని మీరు భావిస్తున్నారు?**

జ. స్వాతంత్ర్యానంతరం ఆర్థికవృద్ధి సాధించే నేపథ్యంలో ప్రభుత్వ వ్యయం గణనీయంగా పెరిగింది. చైనా, పాకిస్థాన్‌తో యుద్ధాల సమయంలో రక్షణ సామాగ్రి కొనుగోలు, వివిధ ఉత్పత్తుల

దిగుమతులు పెరగడం, దేశంలో శాంతి భద్రతలను పరిరక్షించడం, అభివృద్ధి ప్రాజెక్టులు, వీటితో ప్రజా శ్రేయస్సు దృష్ట్యా చేపట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వ వ్యయం పెరగడానికి దోహదం చేశాయి. దీంతో ప్రభుత్వ రుణం కూడా విపరీతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో సమర్థమైన వ్యయవిధానం రూపొందించుకునే నేపథ్యంలో సంస్కరణల కాలంలో ప్రభుత్వం కొన్ని బాధ్యతల నుంచి తప్పుకొని ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించింది. ఆర్థికవృద్ధి మందగించిన నేపథ్యంలో ప్రైవేటు పెట్టుబడులు తగ్గుతాయి. దీని ప్రభావం ఉత్పత్తి, ఉపాధి, ఆదాయం, ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంబంధించి ప్రతికూల ప్రభావాలకు దారి తీస్తుంది. సంక్షోభ నేపథ్యంలో ప్రభుత్వ వ్యయం పెరగాలి. ముఖ్యంగా అవస్థాపనా సౌకర్యాలపై వ్యయం పెంచడం ద్వారా ఆర్థిక వ్యవస్థలో సమిష్టి డిమాండ్ పెరుగుదలకు ప్రయత్నించాలి. సమిష్టి డిమాండ్ తగ్గుదల తిరోగమ నానికి దారి తీయగలదు.

☞ ఈ క్రమంలో ఇటీవలి కాలంలో సంక్షోభ నివారణకు ప్రభుత్వం ప్రకటించిన విత్త మద్దతు వల్ల పెరిగిన ద్రవ్యలోటును పరిశీలించడంతో పాటు ప్రభుత్వ వ్యయం ఏ రంగాలకు అనుకూలంగా ఉండాలి అనే అంశాన్ని విశ్లేషించాలి.

**4. 12వ ఆర్థిక సంఘం సిఫార్సులను వివరించండి?**

**జ.** 2005– 10 కాలానికి సంబంధించి 12వ ఆర్థిక సంఘం తన నివేదికను నవంబర్ 30, 2004న సమర్పించింది. ఆర్థి క సంఘం ప్రభుత్వ విత్త పునర్‌వ్యవస్థీకరణ, కేంద్ర పన్నుల్లో వాటా, స్థానిక సంస్థలు, రాష్ట్రాలకు గ్రాంట్-ఇన్- ఎయిడ్, ప్రకృతి వైపరీత్యాల రిలీఫ్, రుణ విమోచనకు సంబం ధించి తీసుకోవాల్సిన చర్యలను తన నివేదికలో పేర్కొంది.

**5. భారతదేశం లాంటి ఆర్థిక వ్యవస్థలో లోటు విత్త విధానం ఆవశ్యకత వివరించండి?**

**జ.** తన వ్యయానికి అవసరమైన ఆర్థిక వనరుల్ని సమీకరించు కోలేనప్పుడు ప్రభుత్వం లోటు విత్త విధానాన్ని అవలంబిస్తుంది. ఈ విధానంలో భాగంగా ప్రభుత్వం కేంద్ర బ్యాం కు నుంచి రుణాలు సమీకరిస్తుంది. కేంద్ర బ్యాంకు అదనపు ద్రవ్యాన్ని ముద్రించినందువల్ల దేశంలో ద్రవ్య సప్లయ్ పెరిగి ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరుగుతాయి. తద్వారా విదేశీ మారక ద్రవ్య నిల్వలు, రూపాయి మారకపురేటుపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతుంది. ప్రభుత్వం లోటు విధానంలో భాగంగా బ్యాంకులు, విదేశీ ప్రభుత్వాలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రుణాలను సమీకరిస్తుంది. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రణాళికల పరంగా ప్రభుత్వ రంగ పెట్టుబడులకు అవసరమైన వనరుల సమీకరణ సాధ్యం కానపుడు ఈ విధానం అవలంబించడం అవసరం. రుణాల ద్వారా సమీకరించిన వనరులను ఉత్పాదక రంగాల్లో పెట్టుబడులుగా పెట్టినపుడు లోటు విధానం ఆర్థిక వ్యవస్థకు పెద్దగా భారం కాకపోవచ్చు.

☞ ఈ నేపథ్యంలో లోటు విత్త విధానం వల్ల ఆర్థిక వ్యవస్థలో సంభవించే ప్రతికూల, అనుకూల పరిస్థితులను.. విశ్లేషించాలి. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు వనరుల సమీకరణ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో లోటు విత్త విధానాన్ని సమర్థంగా రూపొం దించుకున్నట్లయితే ఆర్థికాభివృద్ధి సాధ్యం కాగలదు. ఈ కోణంలో విశ్లేషించడం ముఖ్యం.

**6. భారతదేశం లాంటి ఆర్థిక వ్యవస్థలలో కోశ విధాన లక్ష్యాలు ఏ విధంగా ఉండాలి?**

**జ.** వనరుల సమర్థ యాజమాన్యం, పంపిణీపై ఆర్థిక వ్యవస్థ వృద్ధి ఆధారపడి ఉంటుంది. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య 'వనరుల అల్ప వినియోగం' ఈ నేపథ్యంలో కోశవిధానం ఆయా దేశాల్లో వనరుల అభిలషణీయ వినియోగానికి దారి తీస్తుంది. సాధారణంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ద్రవ్యోల్బణ సమస్య ఉంటుంది. ప్రభుత్వం తన కోశ విధాన సాధనాలైన పన్నులు, ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ రుణాల ద్వారా ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి ప్రయత్నిస్తుంది. ఆదాయ అసమానతలు, ప్రాంతీయ అసమానతలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న సమ స్యలు. సాంఘిక న్యాయం, సమానత్వం ధ్యేయంగా ఈ దేశాల కోశ విధానం ఉండాలి.

☞ ఈ క్రమంలో ఆదాయ అసమానతలు, ప్రాంతీయ అసమానతలు, ద్రవ్యోల్బణం అరికట్టడానికి ప్రభుత్వం కోశ విధాన సాధనాలను ఎలా ఉపయోగిస్తుంది అనే అంశానికి సం బంధించి అవగాహన పెంచుకోవాలి. తిరోగమన కాలంలో ప్రభుత్వ కోశ విధానం ఏ విధంగా ఉండాలని వివరించడం సముచితంగా ఉంటుంది.

## 12వ ఆర్థిక సంఘం ముఖ్య సిఫార్సులు:

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్ను-జీడీపీ నిష్పత్తి 2009 – 10 నాటికి 17.6 శాతంగా ఉండాలి.
- 2009 – 10 నాటికి ఉమ్మడి రుణ – జీడీపీ నిష్పత్తిని 75 శాతానికి తగ్గించాలి.
- కేంద్ర, రాష్ట్రాల ద్రవ్యలోటును 3 శాతానికి తగ్గించాలి.
- 2008– 09 నాటికి కేంద్ర, రాష్ట్రాల రెవెన్యూలోటు 'సున్నా' (zero) గా ఉండాలి.
- కేంద్ర ప్రభుత్వ పన్నుల రాబడిలో రాష్ట్రాల వాటా 30.5 శాతం ఉండాలి.
- 2005–10 సంవత్సరానికి సంబంధించి రాష్ట్రాలకు పంచాయతీరాజ్ సంస్థలకు రూ. 20000 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ. 5000 కోట్లు కేంద్రం గ్రాంటుగా ఇస్తుంది.
- పట్టణ స్థానిక సంస్థలకు ఇచ్చిన గ్రాంటులో 50 శాతం ప్రభుత్వ –

ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా 'సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్' పై వ్యయం చేయాలి.

- ప్రకృతి వైపరీత్యాల నిధిలో ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్రాల వాటాల నిష్పత్తి 75:25గా ఉంది. దీన్ని అలాగే కొనసాగించాలి.
- 2005–10 మధ్య కాలంలో ప్రణాళికేతర రెవెన్యూ లోటు గ్రాంటుగా 15 రాష్ట్రాలకు రూ. 56,856 కోట్లు మంజూరు చేయాలి.

## ముఖ్యాంశాలు

- స్వాతంత్ర్యానంతరం మొత్తం పన్నుల రాబడిలో పరోక్ష పన్నుల వాటా ఎక్కువ. పురోగామి పన్నుగా భావించే వ్యక్తిగత ఆదాయపు పన్ను వాటా మొత్తం పన్నుల రాబడిలో 15 శాతం మాత్రమే.
- పన్నుల వ్యవస్థకు సంబంధించి సంస్కరణలను సూచించడానికి 1991లో రాజా చెల్లయ్య కమిటీని ఏర్పాటు చేశారు.
- 2002 సెప్టెంబర్‌లో పన్నుల సంస్కరణలకు సంబంధించి విజయ్‌కేల్కర్ కమిటీని ఏర్పాటు చేశారు.
- 2005 – 10 కాలానికి సంబంధించి 12వ ఆర్థిక సంఘం తన నివేదికను నవంబర్ 30, 2004న సమర్పించింది.